క్లుప్తంగా

29 మంది వలంటీర్లు రాజీనామా



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పలు సచివాలయాల్లో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఉండవల్లి 1, 2 సచివాలయాల్లో 29 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను సచివాలయ సెక్రటరీ యస్.శ్రీనివాసరావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ కొంతమంది టీడీపీ కార్యకర్తలు మేము ఎటువంటి ప్రచారం చేయకపోయినా మాపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. రాజీనామా చేసిన ఓ మహిళా వలంటీర్ రోడ్డుపై నిలబడితే ఓ టీడీపీ కార్యకర్త ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టి దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన చెందారు. ఇటువంటి పరిస్థితుల్లో వలంటీర్లంతా రాజీనామా చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికి ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునే విధంగా ప్రచారం నిర్వహిస్తామని అన్నారు.

నేడు వేములూరిపాడులో సుచరిత ప్రచారం

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో మంగళవారం ఉదయం 8 గంటలకు తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని మేకతోటి సుచరిత ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి సోమవారం తెలిపారు. అదేరోజు సాయంత్రం ఫిరంగిపురంలోని క్రీస్తునగర్‌లో ప్రచారం చేస్తారని చెప్పారు. పార్టీ శ్రేణులంతా ప్రచార కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

సీఎం వైఎస్ జగన్‌కే ప్రజల మద్దతు



కంతేరు(తాడికొండ): జగనన్నను సీఎంగా గెలిపించుకునేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని తాడికొండ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. తాడికొండ మండలం కంతేరు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ తిరిగి నమూనా బ్యాలెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు, ఎంపీటీసీ వలపర్ల కల్పన, సొసైటీ అధ్యక్షుడు విజయరాజు, గ్రామపార్టీ అధ్యక్షుడు నంద్యాల సదానందరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం



ఫిరంగిపురం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని వైద్యురాలు ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 226 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వేసవికాలంలో శరీర శుభ్రతతో పాటు తమ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. శిబిరంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్ఎం ఆనందకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచినీళ్లు అడిగి..వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

చేబ్రోలు: మధ్యాహ్నం సమయంలో దప్పికవుతుందని, తాగునీరు కావాలని అడిగిన ఇద్దరు యువకులు.. మంచినీరు ఇచ్చిన వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. కొత్తరెడ్డిపాలెంలో గాదె సీతారామమ్మ అనే వృద్ధురాలు ఉంటోంది. ఆమె కుమారుడు వ్యాపార రీత్యా గుంటూరులో ఉంటున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన సుమారు 25ఏళ్ల వయస్సు కలిగిన ఇద్దరు యువకులు.. సీతారామమ్మను మంచినీరు కావాలని అడిగారు. ఆమె ఇంటిలోకి వెళ్లి నీరు తెచ్చి ఇచ్చింది. ఆమె వెనుతిరిగిన వెంటనే మెడలో ఉన్న సుమారు రూ.1.50లక్షలు విలువ చేసే రెండు వరుసల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. ఈ ఘటనను కుమాడు గాదె వెంకట శివరామకృష్ణారెడ్డికి తెలియజేయటంతో.. పరిసర ప్రాంతాల్లో విచారించిన అనంతరం అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ పి.మహేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

రైతు బాంధవుడు సీఎం వైఎస్ జగన్

- అన్నదాతల బతుకుల్లో వెలుగులు నిండాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాల్సిందే
- మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య
- పెనుమాకలో గంజి చిరంజీవితో కలిసి ఎన్నికల ప్రచారం



ప్రచారంలో వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న లావణ్య, గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవితో కలసి పెనుమాకలో సోమవారం సాయంత్రం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పెనుమాక పార్టీ అధ్యక్షులు దామేశ్వరరెడ్డి, సొసైటీ అధ్యక్షులు మేకా శివారెడ్డి, బొక్కా ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, గుర్రం జాషువా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మే 13న జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం బ్యాలెట్‌లో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యకు 1వ నెంబరు, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్యకు 4వ నెంబరు గుర్తుపై బటన్ నొక్కి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలంటూ ప్రచారం నిర్వహించారు. పెనుమాక శివారు నుంచి రోడ్‌షో నిర్వహించిన ఆమె పలు ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. లావణ్య రాకను పురస్కరించుకుని భారీ సంఖ్యలో మహిళలు ప్రచారంలో పాల్గొని ఎమ్మెల్యే అభ్యర్థిని లావణ్యకు హారతులు ఇస్తూ సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. మురుగుడు లావణ్య మాట్లాడుతూ అన్నదాతలకు న్యాయం జరగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. పెనుమాకలో రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా పని చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో పెనుమాకలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తుతం జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకోవాలని కోరారు. 2014 నుంచి 2019 వరకు పెనుమాకలో ఒక్క ప్రధాన రహదారి తప్ప ఇతర రహదారులు నిర్మించలేదని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే ఆర్కే పెనుమాకలో రైతులు పంట పొలాలకు వెళ్లే రహదారులను బీటీ రోడ్లుగా నిర్మించారని గుర్తు చేశారు. ఈ ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు శాండ్ ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేసి నిరంతరం తాగునీటిని అందజేస్తున్నామని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయిస్తే పేదలు ఇక్కడ ఉండడానికి వీలు లేదంటూ కోర్టును ఆశ్రయించిన ఘనత టీడీపీకే చెందిందని ఆమె ఎద్దేవా చేశారు. పెనుమాకలోని పలు చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు, దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెనుమాక యువకులు యేసు ప్రభువు శిలువలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, లావణ్య ఉన్న చిత్రాన్ని ఆమెకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ విజయ్‌కుమార్, కళ్లం అరవిందరెడ్డి, అన్నూరి దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు మేకా అంజిరెడ్డి, భవనం రవీంద్రరెడ్డి, అన్నూరు సుబ్బారావు, నెమలికంటి పుల్లారావు, బషీర్, భుజంగరావు, ప్రభాకర్ రెడ్డి, తమ్మా శ్రీనివాసరెడ్డి, కళ్లం శ్రీకాంత్‌రెడ్డి, అజయ్‌కుమార్, కూరపాటి మహేష్, సురేష్, రవీంద్ర, అందే పద్మ, గుర్రాల చిన్ని, బాణావత్ శ్రీనునాయక్, అన్నూరు సంధ్య, మేకా గోవర్ధన్ రెడ్డి, ఈశ్వరమ్మ, బొక్కా స్వర్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాజన్నరాజ్యం జగనన్నతోనే సాధ్యం



రిషికకు హారతులిచ్చి స్వాగతిస్తున్న మహిళలు

ఫిరంగిపురం: రాజన్న రాజ్యం రావాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యమవుతుందని తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని మేకతోటి సుచరిత కుమార్తె రిషిక అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలను పలకరించారు. కొందరు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. రిషిక మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. తన తండ్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించారన్నారు. మళ్లీ జగనన్న రాజ్యం రావాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తన తల్లి సుచరితను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం సునీత, బాపూజీరెడ్డి, సలీం, హేమలతారెడ్డి, వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి గెలుపు కోసం తనయ ప్రచారం

మందడంలో ఎన్నికల ప్రచారం చేపట్టిన సుచరిత కుమార్తె రిషిక



మందడంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సుచరిత కుమార్తె మేకతోటి రిషిక

మందడం(తాడికొండ): తుళ్లూరు మండలం మందడం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థిని సుచరిత కుమార్తె మేకతోటి రిషిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిసి ఎమ్మెల్యేగా తన తల్లి మేకతోటి సుచరిత, ఎంపీగా కిలారి వెంకట రోశయ్యను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వృద్ధులు, వికలాంగులను ఆప్యాయంగా పలకరిస్తూ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గ్రామస్తులు ఆమెపై తమ అభిమానం కురిపించారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి చేరువ కావాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మందడం సొసైటీ అధ్యక్షుడు ఆలూరి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలూరి చిన్న శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కోలేటి అనీల్, సంకూరు పుల్లయ్య, దానం నాగేశ్వరరావు, యంగలదాసు వెంకట్, పాతూరి విజయ్, బేతపూడి ప్రభాకర్, బేతపూడి వికాస్ పాల్, కొల్లి ప్రసాద్, దేవరపల్లి నరసింహారావు, యంగలదాసు వెంకట్రావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

పాములపాడులో పార్టీలో చేరిన టీడీపీ వర్గీయులకు కండువాలు కప్పి ఆహ్వానించిన దయాసాగర్



కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న మేకతోటి దయాసాగర్

తాడికొండ: తాడికొండ మండలం పాములపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన 20 కుటుంబాలు సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు నల్లమోతుల శ్రీ రామాంజనేయులు, పరుచూరి నారాయణల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జొన్నకూటి మదన్, జొన్నకూటి దాసుల ఆధ్వర్యంలో 20 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బొర్రా వెంకటేశ్వర రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి ధర్మరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పేదలే స్టార్ క్యాంపెయినర్లు



జంగంగుంట్లపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత

- తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత
- జంగంగుంట్లపాలెం, భీమినేనివారిపాలెం, పొట్లపాడు, మంగళగిరిపాడు, తురకపాలెం, డోగిపర్రు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

మేడికొండూరు: మండల పరిధిలోని జంగంగుంట్లపాలెం, భీమినేనివారిపాలెం, పొట్లపాడు, మంగళగిరిపాడు, తురకపాలెం, డోగిపర్రు గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత పాల్గొన్నారు. గ్రామాల్లోని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు ఆమెకు హారతులు పట్టారు. ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించి పూలు జల్లుతూ గ్రామంలోకి ఘనంగా స్వాగతం పలికారు. దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక పూజల్లో సుచరిత పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రకటించిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు.పేదలే పార్టీకి స్టార్ క్యాంపెయినర్లని అన్నారు. గడిచిన ఐదేళ్లల్లో జరిగిన అభివృద్ధి, పొందిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని అభివృద్ధి జగనన్న హయాంలోనే జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రెండు ఓట్లు సీలింగ్ ఫ్యాను గుర్తుపై వేసి ఎంపీగా కిలారి వెంకటరోశయ్యను, ఎమ్మెల్యేగా తనను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరు వంశీకృష్ణ, జంగంగుంట్లపాలెం సర్పంచ్ కల్లి శ్రీదేవి సాంబిరెడ్డి, డోగిపర్రు సర్పంచ్ కొండెపోగు సాంబ్రాజ్యం, మంగళగిరిపాడు సర్పంచ్ షేక్ రబ్బాని, వైస్ ప్రెసిడెంట్ షేక్‌జానీ, ఆవుల సంజీవరెడ్డి, కొరివి కిషోర్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, షేక్ అబ్దుల్లా, అబ్బాస్, లూర్థురాజు, శ్రీనివాసరెడ్డి, నరసింహారావు, సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

232 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం హజ్ యాత్రకు వెళ్లే 232 మందికి ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. వ్యాక్సిన్ చేయించుకోవడం ద్వారా పోలియో, మెదడు వాపు, ఫ్లూ ఇతర వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. హజ్ యాత్రకు వెళ్లేవారికి మందులు ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో ఇమ్యూనైజేషన్ అధికారులు డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మానవాళికి సత్యం, ధర్మాన్ని బోధించాలి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మూడు రోజులపాటు జరగనున్న 'సంక్షిప్త రామాయణం' ధారావాహిక ప్రవచనం సోమవారం రాత్రి ప్రారంభమైంది. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు కేవీ కోటేశ్వరరావు ప్రసంగిస్తూ మానవ జీవితం అత్యంత పవిత్రమైనదని అన్నారు. మనం కోరుకుంటే మానవ జీవితం లభించదని, దాన్ని గొప్పగా వినియోగించుకోవడంలో సార్థకత ఉందని చెప్పారు. ధర్మం, దైవం కోసం కొంతైనా సమయం కేటాయించలేకపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, మన్నవ రవిప్రసాద్, పి.శివారెడ్డి, సాంబశివరావు, మురికిపూడి లక్ష్మీసత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో సోమవారం మాస శివరాత్రి సందర్భంగా గణపతి, చండీహోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో జరగ్గా, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితులు గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్దేశిత ప్రదేశాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు



ఆరోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న మన్‌మోహన్

ఫిరంగిపురం: ఎన్నికల సమయంలో నిర్దేశించిన బూతుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా పారా మెడికల్ అధికారి సీహెచ్ మన్‌మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని ఫిరంగిపురం పీహెచ్‌సీని సోమవారం ఆయన పరిశీలించారు. పలు రికార్డులు, ఓపీ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ నెల 13న ఎన్నికలు నిర్వహించే బూతుల వద్ద ఒక ఏఎన్ఎం, ఇద్దరు ఆశా కార్యకర్తలతో కూడిన సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటు చేసి తగిన చికిత్స అందించాలన్నారు. ప్రతి శిబిరం వద్ద వీల్ చైర్‌ను ఏర్పాటు చేస్తామని దాని ద్వారా నడవలేని వారు ఉంటే దానిని వినియోగించుకునేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిబిరాలకు అవసరమైన మందులు అందజేస్తామని చెప్పారు. ఆయన వెంట వైద్యురాలు శ్వేత, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, సిబ్బంది ఉన్నారు.

తాడికొండలో పోలైన 240 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు



చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగులు

తాడికొండ: సోమవారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 240 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుంటూరు జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలో తాడికొండ-1, గుంటూరు ఈస్ట్-38, గుంటూరు వెస్ట్ -74, తెనాలి- 29, పత్తిపాడు- 20, మంగళగిరి-9, పొన్నూరు-16, ఇతర జిల్లాలకు చెందిన ఓటర్లు 53 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే ఓటు హక్కు వినియోగించు కునేందుకు వచ్చిన పలువురు ఉద్యోగులకు తమ ఓటు ఎక్కడ ఉందో తెలియక నానా తికమక పడ్డారు. ఎన్నికల అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వని కారణంగా ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులు వాదులాటకు దిగడంతో తలలు పట్టుకోవడం అధికారుల వంతైంది.

హత్య కేసులో నిందితుల అరెస్టు

పట్నంబజారు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హతమార్చేందుకు సహకరించిన భార్య, హతమార్చిన ఆమె ప్రియుడు, మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం, ఆర్.ఉమ్మడివరం గ్రామానికి చెందిన కుక్కమూడి ప్రేమ్‌కుమార్(35) తన భార్య, పిల్లలతో బతుకు తెరువు నిమిత్తం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోటలో నివాసం ఉంటూ మార్కెట్‌లో పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. అతడి భార్య భారతీ లాలాపేట పూల మార్కెట్ సెంటర్‌లో సమోసాలు తయారు చేసే షాపులో పనికి వెళుతుంటోంది. ఈక్రమంలో షాపు యజమాని షేక్ గౌస్‌తో అక్రమ సంబంధం పెట్టుకున్న క్రమంలో విషయం తెలిసిన ప్రేమ్‌కుమార్ తన భార్యను వారించాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో భర్తను హతమార్చేందుకు భారతీ పక్కా పథకం రచించింది. అప్పటికే పరిచయం ఉన్న గౌస్ గతనెల 28వ తేదీ రాత్రి ప్రేమ్‌కుమార్‌ను మద్యం తాగుదామని మాయమాటలు చెప్పి గౌస్‌తోపాటు తన తమ్ముడు ఖాశిం, అతని స్నేహితుడు రహమాన్ పథకం ప్రకారం ప్రేమ్‌కుమార్‌ను వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు పరిధిలోని ఖాళీ స్థలాల్లోకి తీసుకెళ్లారు. మద్యం తాగించి కర్రతో కొట్టి వెంట తెచ్చుకున్న కత్తులతో ప్రేమ్‌కుమార్ గొంతు కోసి హతమార్చారు. అనంతరం ప్రేమ్‌కుమార్ భార్య భారతీ తనకు ఏమీ తెలియనట్లు గతనెల 29వ తేదీన తన భర్త పెళ్లికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదని, కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు చేపట్టిన ట్రాఫిక్ డీఎస్పీ వి.వి.నాయుడు, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్ఓ షేక్ అన్వర్‌బాషా, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా భారతీ ప్రియుడు గౌస్‌తో కలిసి భర్తను హతమార్చినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, నిందితులు నేరాన్ని అంగీకరించారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

నాట్కోలో వారంలో నాలుగు రోజులు ఆపరేషన్లు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సర్జికల్ ఆంకాలజీ విభాగంలో వారంలో నాలుగు రోజులు ఆపరేషన్లు, రెండు రోజులు ఓపీ ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. సోమవారం ఆసుపత్రి నాట్కో సెంటర్‌లో పలు విభాగాధిపతులతో సమీక్ష చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అన్ని ఓపీల మాదిరిగానే నాట్కో సెంటర్‌లో కూడా ఓపీ ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలన్నారు. మధ్యాహ్నం కూడా ఓపీ నిర్వహించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ప్రతి సోమ, గురువారం మెడికల్ ఆంకాలజీ విభాగంలో కొత్త ఓపీ రిజిస్ట్రేషన్ లు జరగాలని చెప్పారు. మంగళ, శుక్ర వారాల్లో రేడియేషన్ ఆంకాలజీలో రిజిస్ట్రేషన్లు, బుధ, శని వారం సర్జికల్ ఆంకాలజీ రిజిస్ట్రేషన్లు జరగాలని తెలిపారు. మూడు వైద్య విభాగాలు సమన్వయంతో పని చేయాలనీ, ఒకరి ఎక్కువ మరొకరు తక్కువ అనే భావన రాకూడదన్నారు. 15 రోజులుగా సర్జికల్ విభాగంలో డీఈఓ రావడం లేదని ఆంకాలజీ వైద్యులు వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ దృష్టికి తీసుకుని రాగానే వెంటనే నోటీసు ఇచ్చి వేరే ఒకరిని నియమించాలని ఆదేశించారు. ఆరోగ్య మిత్రలు కూడా సక్రమంగా విధులకు హాజరు కావాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో సోమవారం ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న గోపి గాయపడ్డాడు. గాయపడి క్యాజువాల్టీలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పరామర్శించారు. పేషంట్ కు అత్యవర చికిత్సతో పాటు ప్రత్యేక వార్డును కేటాయించాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరొకరికి ఎలాంటి ప్రమాదం జరగకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక టూల్ కిట్ ను కొనుగోలు చేసి ఎలక్ట్రీషన్‌లకు అందజేశామన్నారు. విధుల్లో సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

దివీస్ ల్యాబ్ క్యాంపస్ ఇంటర్వ్యూలు



విద్యార్థులతో జూపూడి రంగరాజు, మధుసూదనరావు, నాగభూషణం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధ కళాశాలల్లో బీ ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్న 70 మంది విద్యార్థులు హాజరు కాగా, వారికి వివిధ దశల్లో ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. రాత పరీక్ష, మౌఖిక ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థులను ఎంపిక చేసిన దివీస్ ల్యాబ్స్ ప్రతినిధులు వారికి త్వరలో ఉద్యోగ నియామక పత్రాలు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు, ఓఎస్డీ డాక్టర్ పి.సీ తారామయ్య అభినందించారు.

బ్లేడ్‌తో దాడి, దోపిడీ

తెనాలి రూరల్: రోడ్డు వెంబడి ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న వారిని బ్లేడుతో దాడి చేసి గాయపరిచి వారి వద్ద ఉన్న నగదును దోచుకెళ్లిన ఘటన ఆదివారం అర్ధరాత్రి తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... తెనాలి రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో వంతెన ఫుట్‌పాత్‌పై కొందరు నిద్రిస్తున్నారు. నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి నిద్రిస్తున వారి జేబులు వెతుకుతుండగా అప్పుడే భోజనం చేస్తున్న పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గురజాల కోటిబాబు ఎందుకు వెతుకుతున్నారని ప్రశ్నించాడు. దీంతో అతడి వద్దకు వచ్చిన నలుగురు యువకులు బ్లేడుతో అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, అతడి వద్ద ఉన్న రూ.1,800, సెల్‌ఫోను లాక్కు వెళ్లారు. బాధితుడు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అతడిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపారు.

ఏసీబీ డీఎస్పీ బదిలీ

నగరంపాలెం: గుంటూరు ఏసీబీ డీఎస్పీ టీవీవీ ప్రతాప్‌కుమార్ బదిలీయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఆయన్ను అనంతపురం జిల్లా అర్బన్ డీఎస్పీగా బదిలీ చేశారు. సుమారు 4 ఏళ్ల పాటు ఆయన ఏసీబీలో సమర్థంగా విధులు నిర్వహించారు.